www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

## సర్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని తనిఖీ చేసిన ఎమ్మార్వో రజనీకాంత్ రెడ్డి





**కౌతాళం,జూన్19.అక్షర టైమ్స్:-** కౌతాళం మండల పరిధిలోనే పోదలకుంట, హల్వి,ఉరుకుంద మరియు కామవరం గ్రామలలో నిర్వహిస్తున్న సర్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని ఎమ్మార్వో రజనీకాంత్ రెడ్డి శుక్రవారం రోజున తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరు మరియు నమోదవుతున్న వివరాలను పరిశీలించి కార్యక్రమాన్ని ఎన్నికలు సంఘం నిబంధనలు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని వారికి సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మార్వో రజనీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సర్ 2025 కార్యక్రమం విజయవంతంగా అములు కావాలంటే క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి కచ్చితమైన వివరాలను సేకరించాలని నమోదైన సమాచారాన్ని జాగ్రత్తగా ధ్రువకరించాలని ఆదేశించారు.ఎలాంటి పొరపాటు లేకుండా పనులను పూర్తి చేసి ఓటర్ జాబితా సమగ్రతను కాపాడాలని సూచించారు. సర్ 2025 కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి మరణించిన, వేరేప్రాంతాలకు మారిన మరియు డూప్లికేట్ ఓటర్లు వివరాలను పరిశీలిస్తారు. అలాగే అర్హులైన కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడంతో పాటు ఓటర్లు తమ వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా ధ్రువకరించుకోవాలని సూచించారు.మరియు ఓటర్లు ఏన్యుమీరేషన్ ఫారం ను తీసుకున్న తర్వాత తమ గుర్తింపు కార్డు పాస్పోర్ట్ సైజు ఫోటోను ఇచ్చి అవసరమైన సమాచారం సంబంధిత పత్రాలను బిఎల్వోలకు అందించి ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు.సర్ మ్యాపింగ్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేసి నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులకు ఎమ్మార్వో రజనీకాంత్ రెడ్డి ఆదేశించారు.

## ఎరువులు పంపిణీ ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా పంపిణీ చేయాలి

### మండల వ్యవసాయ అధికారి శేషాద్రి



**కౌతాళం,జూన్19.అక్షర టైమ్స్:-** శుక్రవారం రోజున కౌతాళం మండలంలో వివిధ గ్రామాల నందు ఉన్న ఆర్ఎస్కే లకు యూరియా డిఏపి రావడం జరిగింది. మండలంలోని రైతాంగానికి వ్యవసాయ శాఖ తరపున విజ్ఞప్తి ఎరువుల పంపిణీ ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా జరుగుతున్నది ఇందులో రైతులకున్న ఎకరాలు బట్టి వారి వేసే పంటను బట్టి ఎన్ని ఎకరాలు ఉన్న ఎకరాకు నిర్దేశించిన మోతాదు ప్రకారం వేసిన పంటకు తగ్గట్టుగా ఇవ్వడం జరుగుతుంది. ఇందుకుగాను రైతు ఆర్ఎస్కే అసిస్టెంట్ ద్వారా తాను వెయ్యబోయే పంటను ముందుగా ఆర్ఎస్కే అసిస్టెంట్ ను కలిసి మార్పు చేసుకొనవలెను లేదా గత సంవత్సరం వేసిన పంట ఆధారితంగా మీకు ఆ మోతాదుకు తగ్గట్టుకు ఎరువులు కేటాయించబడతాయి.కేటాయించబడిన ఎరువులను మూడు దఫాలుగా ఇవ్వబడతాయి ఒక్కొక్క దాపకు 20 రోజుల్లో వ్యవధి చొప్పున పంపిణీ చేయబడుతుంది. ప్రతి రైతుకి ఏపీఎంఎస్ యాప్ లో సూచించిన విధంగా పూర్తిగా మొదటి దఫాలో ఎంతవరకు కేటాయించబడితే అంతవరకు మీరు తీసుకోవడానికి ఆస్కారం ఉన్నది.ఒక ఎకరా రెండెకరాలు ఉన్న రైతులకి మాత్రం మొదటి దఫాలో ఎరువులు మొత్తం చూపిస్తాయి వాటిని మీరు పొందగలరు. సదరు ఎరువులు మీరు మీ భూములున్న గ్రామం లో ఉన్న ఆర్ఎస్కే లోనే పొందగలరు. అంతేకాకుండా రైతులు ఏపీఎంఎస్ యాప్ వారి మొబైల్ లో డౌన్లోడ్ చేసుకొని లాగిన్ అవ్వడం వల్ల ఎరువులకు సంబంధించిన వివరాలు మరియు పంటకు సంబంధించిన పురుగుమందులు తెగుళ్ళు, వాతావరణ పరిస్థితులు అన్నీ కూడా ఆ యాప్ ద్వారా తెలుసుకోబడతాయి. ఈ దినము మండల వ్యవసాయ అధికారి కౌతాలంవారు ఉరుకుంద గుడి కంబాలి గ్రామాలలో యూరియా మరియు డిఏపి పంపిణీ పర్యవేక్షించారు. తదుపరి రైతులకు యాప్ ద్వారా యూరియా డిఏపి పంపిణీ చేయడం జరిగింది.రైతులకు ముఖ్య గమనిక మండలంలోని ఏ ఎరువు దుకాణాల్లో అయినా యూరియా డిఏపి అమ్మకాలకు ఇతర ఎరువులు లింకు ద్వారా తీసుకోవాలని బలవంతపు అంటె కట్టడాలు జరిగితే తక్షణమే మండల వ్యవసాయ అధికారి వారికి తెలియజేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను. రైతులకు ఎటువంటి లింకులు తావివ్వకుండా ప్రతి గ్రామంలో యూరియా మరియు డిఏపి,రైతు సేవా కేంద్రాల నుండి పంపిణీ చేయడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శేషాద్రి, ఎంపీఓ రాజు, అగ్రికల్చర్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## నాటుసారా రహిత సమాజమే లక్ష్యం

### 'నవోదయం 2.ూ' లో భాగంగా బండి ఆత్మకూరు మండలం నారపురెడ్డి కుంట గ్రామంలో లో అవగాహన సదస్సు



**నంద్యాల,జూన్19.అక్షర టైమ్స్:-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నవోదయం 2.ూ' కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గనియా ఆదేశాల మేరకు, నంద్యాల జిల్లా ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి సాదు రవికుమార్, సూచనలు మేరకు ఈరోజు (శుక్రవారం) బండి ఆత్మకూరు మండలం నారాపూరెడ్డి కుంట నందు నాటుసారా తయారీ, అమ్మకాల నివారణపై ఒక ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని, నాటుసారా వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ, ఈ వృత్తిని మానుకుని ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల ద్వారా గౌరవప్రదమైన జీవితాన్ని సాగించాలని పిలుపునిచ్చారు. అధికారుల ప్రసంగాలు - ముఖ్యమైన అంశాలు: ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు: నాటుసారా తయారీని పూర్తిగా మానుకునే కుటుంబాలకు ప్రభుత్వం తరపున ?15,000 ఆర్థిక సహాయం (రాశీుఅ) అందించి, కిరాణా దుకాణాలు, కూరగాయల వ్యాపారం, గొర్రెల పెంపకం లేదా బర్రెల పెంపకం వంటి స్వయం ఉపాధి మార్గాలను కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి: సారా తయారీ కుటుంబాల్లోని నిరుద్యోగ యువతీ యువకులకు డీఆర్డీఏ (ఱ=ఱూ) / ఉపాధి హామీ పథకం ద్వారా డ్రైవింగ్, టైలరింగ్, కంప్యూటర్స్ వంటి కోర్సులలో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. పిల్లల చదువులకు భరోసా: ఈ కుటుంబాలలోని పిల్లల భవిష్యత్తు కోసం గురుకుల పాఠశాలల్లో (=వంఱవత్ఖుశ్రీ ూఎష్ట్రశీశ్రీం) సీట్లు ఇప్పించి, వారి ఉన్నత చదువులకు, పోటీ పరీక్షలకు (జశీఎజూవ్ఱజవ జుఞఖుఎం) మెటీరియల్స్ అందించి ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఆరోగ్యం మరియు సంక్షేమం: నాటుసారా మహమ్మారి వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు.

## ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతుల అందించి ప్రోత్సహించిన బి.లక్ష్మి రెడ్డి




**కౌతాళం,జూన్19.అక్షర టైమ్స్:-** గత సంవత్సరం బదినేహల్ గ్రామంలోని ప్రాథమిక కన్నడ పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులు ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బదినేహాల్ గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు బి.లక్ష్మి రెడ్డి ఎనిమిది మంది విద్యార్థులకు దుస్తులు బహుమతిగా అందించారు. వారికీ ఎంతో అభినందనీయమైన కార్యం. వారి ఈ మహత్తర సేవ విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించడమే కాకుండా, సమాజంలో విద్య పట్ల అవగాహనను పెంపొందించే ఒక మంచి ఆదర్శంగా నిలిచింది.ఈ సందర్భంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ సంతోషాన్ని వ్యక్తపరచడం ఎంతో ఆనందకరమైన విషయం అని వారి సేవాభావాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తూ,కన్నడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. అరుణజ్యోతి, ఉపాధ్యాయులు ఐ.వీరేష్ మరియు యు.అంబరేష్ వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.బదినేహల్ గ్రామంలోని ప్రాథమిక కన్నడ పాఠశాల తరపున మరోమారు వారికి ధన్యవాదాలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నాము అని వారు కోరారు.

## పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి : మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న



**నంద్యాల,జూన్19.అక్షర టైమ్స్:-** నంద్యాల పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచే దిశగా మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న శుక్రవారం ఉదయం పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి శానిటేషన్ పనులను పరిశీలించారు. ప్రధాన రహదారులు, చెత్త సేకరణ కేంద్రాలు, డంపింగ్ పాయింట్ల వద్ద జరుగుతున్న పనులను స్వయంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. పట్టణంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ప్రతిరోజూ సమయానికి సేకరణ చేపట్టాలని, రహదారుల పక్కన చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు. చెత్త తరలింపు వాహనాలు నిర్దేశిత సమయాలకు పనిచేయడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్య చర్యలను మరింత వేగవంతం చేయాలని, చెత్త నిల్వ ఉండే ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి వెంటనే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం మున్సిపాలిటీ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ విక్రమ్, శానిటేషన్ సూపర్వైజర్ లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ మొదటి విడత పంపిణీ: ఏఓ పవన్ కుమార్




**బండి ఆత్మకూరు,జూన్19.అక్షర టైమ్స్:-** బండి ఆత్మకూరు మండలం అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ మొదటి విడత పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. వారు మాట్లాడుతూ...అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం ఈ ఏడాది మొదటి విడత పంపిణీ కార్యక్రమం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు నిర్వహిస్తున్నట్లు ఏఓ తెలిపారు.ఈ పథకం ద్వారా మండల వ్యాప్తంగా 7734 రైతు కుటుంబాలకు ఐదు కోట్ల ముప్పై రెండు లక్షల రూపాయలు లబ్ధి పొందుతారని ఏఓ తెలిపారు.ఈ విడతలో రాష్ట్ర వాటాగా ఒక్కో రైతుకు రూ.5 వేల కేంద్ర వాటా రూ. 2 వేలతో కలిపి మొత్తం రూ.7000 ప్రతి రైతు కుటుంబానికి జమ కానున్నది. ఒక్కో రైతు కుటుంబానికి కేంద్రం 6000 సాయంతో రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.14 వేలు కలిపి ఏడాదికి రూ.20 వేలు ఇస్తుందన్నారు.మరోవైపు విశిష్ట సంఖ్య కలిగి ఆధార్ బ్యాంకు ఖాతాతో ఎన్ పిసిఐ లింక్ చేసుకున్న రైతులకు మాత్రమే లబ్ధి పొందుతారని, కావున రైతులు ఫార్మర్ ఐడి కొరకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకుని,తమ బ్యాంకు ఖాతాలను ఆధార్ తో తప్పనిసరిగా అనుసంధానం చేసుకోవాలని వెల్లడించారు.ఈ పథకంపై సందేహాల నివృత్తి కోసం స్థానిక రైతు సేవా కేంద్రం సిబ్బంది లేదా 155251 టోల్ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉన్నదని, అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం సంబంధించి ఎటువంటి సమస్యలున్న స్థానిక రైతు సేవా కేంద్రంలో అర్జీ ద్వారా తెలపాలని రైతులను ఏఓ కోరారు. ప్రతి గ్రామ రైతు సేవ కేంద్రంలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ మొదటి విడత పంపిణీ పీఎం కిసాన్ ఉత్సవ్ దివాస్ కార్యక్రమం నిర్వహిస్తామని ఏఓ తెలిపారు.

## నంద్యాల జిల్లా చదరంగం జట్ల ఎంపిక పోటీలు

### ప్రారంభించిన డాక్టర్ రామకృష్ణ రెడ్డి

### చదరంగం మేధో శక్తిని, ఏకాగ్రతను పెంచుతుంది: డాక్టర్ రవి కృష్ణ



**నంద్యాల,జూన్19.అక్షర టైమ్స్:-** నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో అమెచ్యూర్ నంద్యాల జిల్లా చదరంగం జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చదరంగం క్రీడ వలన బాలలలో మానసిక వికాసం కలుగుతుందని, చదరంగం క్రీడ విద్యార్థులలో గెలుపు ఓటములను స్వీకరించే మనస్తత్వం, ఓటమి చెందాక తిరిగి గెలవాలనే పట్టుదల పెంచే క్రీడా అన్నారు.డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ చదరంగం మేధో శక్తిని,ఏకాగ్రతను ఇనుమడింప చేస్తుందని అన్నారు. తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాలని కోరారు. నిరంతర సాధన ద్వారా చదరంగంలోమెలకువలను, నైపుణ్యాన్ని పెంచుకోవాలని కోరారు.నంద్యాల జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారు విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి,డాక్టర్ రవి కృష్ణ చెస్ బోర్డుపై పావులు కదిపి చదరంగం పోటీలను లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్ సుజాత, కోచ్ సురేష్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దివ్యాంగు రాలికి నిత్యవసర సరుకులు పంపిణీ



**నంద్యాల,జూన్19.అక్షర టైమ్స్:** నంద్యాల పట్టణంలోని రాయల్ కాంపౌండ్ కు చెందిన సావిత్రి అనే నిరుపేద దివ్యాంగురాలు కు గత మూడు నెలల క్రిందట ఆమె ఆర్థిక పరిస్థితి నేను గమనించి డిసేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ ఆధ్వర్యంలో నంద్యాల బ్లడ్ బ్యాంక్ ఎండి బ్లడ్ అచ్చు, సహకారంతో నిత్యవసర సరుకులు మరియు బియ్యం ప్యాకెట్ అందించడం జరిగినది. మరల దివ్యాంగురాలు సావిత్రి ఆర్థిక పరిస్థితిని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డిపి మస్తాన్ వలి నంద్యాల బ్లడ్ బ్యాంకు ఎండి బ్లడ్ అచ్చు దృష్టికి తీసుకుని పోగా ఆయన స్పందించి ఆమెకు నిత్యవసర సరుకులను పంపిణీ చేయడం జరిగినది. దివ్యాంగులకు ఎల్లప్పుడూ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని బ్లడ్ అచ్చు హామీ ఇవ్వడం జరిగినది.ఈ కార్యక్రమంలో నంద్యాల బ్లడ్ బ్యాంకు సిబ్బంది ప్రవీణ్, మనోహర్, పవన్, శివ,నాగార్జున, రహెల్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత వాహనాలకు బదులు బస్సుల్లో ప్రయాణించిన జిల్లా యంత్రాంగం



**నంద్యాల,జూన్19.అక్షర టైమ్స్:-** ఇంధన పొదుపు కేవలం నినాదంగా కాకుండా ఆచరణలో కూడా సాధ్యమేనని నంద్యాల జిల్లా అధికారులు నిరూపించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా జిల్లా యంత్రాంగం వ్యక్తిగత వాహనాలను పక్కనపెట్టి, సమిష్టిగా బస్సుల్లో ప్రయాణిస్తూ ప్రజలకు ఆదర్శవంతమైన సందేశాన్ని అందించారు. శుక్రవారం శ్రీశైలం నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమానికి హాజరయ్యేందుకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు నంద్యాల కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ ప్రాంగణం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో బయలుదేరారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంధన పొదుపు ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రజలకు సందేశం ఇచ్చే ముందు అధికారులు స్వయంగా ఆచరణలో చూపించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. జిల్లా, డివిజనల్, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు విడివిడిగా వాహనాలు వినియోగించకుండా బస్సుల్లో సమిష్టిగా ప్రయాణించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని చెప్పారు. "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమం ప్రతి పర్యటనలో ఇదే విధానాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంయుక్త తనిఖీలు, సమావేశాలు, అధికారిక పర్యటనల సందర్భాల్లో ఒకే వాహనాన్ని వినియోగించడం ద్వారా ఇంధన వినియోగం తగ్గడమే కాకుండా ప్రభుత్వ వ్యయాలు కూడా ఆదా అవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ చర్య ప్రజల్లో ఇంధన పొదుపుపై మరింత అవగాహన పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

## నిరుద్యోగ యువతకు వరంగా నిలిచిన జాబమేళా :ఎమ్మెల్యే పార్థసారథి






**ఆదోని,జూన్19.అక్షర టైమ్స్:-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగ మేళా నిరుద్యోగ యువతకు ఆశాకిరణంగా నిలిచిందని ఆదోని ఎమ్మెల్యే డా. పీవీ పార్థసారథి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతో పాటు నైపుణ్యాలు కూడా ఎంతో అవసరమని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూలలో ఎలా ప్రవర్తించాలి, ఆత్మవిశ్వాసంతో ఎలా సమాధానాలు ఇవ్వాలి అనే అంశాలపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ ఉద్యోగ మేళాలో వివిధ రంగాలకు చెందిన 15 బహుళ జాతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొనగా, మొత్తం 262 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. వారిలో 103 మంది అభ్యర్థులు వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషం. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12,000 నుండి రూ.24,000 వరకు వేతనంతో పాటు ఇతర అలవెన్సులు కూడా అందజేయనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎల్. ఆనంద్ రాజ్ కుమార్ తెలిపారు. యువత ఉద్యోగాలు సాధించడం ద్వారా వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని ఎమ్మెల్యే డా. పీవీ పార్థసారథి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అయ్యప్ప, కళాశాల కరస్పాండెంట్ దైవదినం రెడ్డి, చైర్మన్ విట్టా సతీష్, స్కిల్ ప్లేస్మెంట్ ఆఫీసర్ సాయితేజ, కో-ఆర్డినేటర్లు, అధ్యాపకులు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కాశినాయన మండలం లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు






**కాశినాయన,జూన్19.అక్షరటైమ్స్:-** బద్వేల్ నియోజకవర్గం లోని కాశినాయన మండలం ఓబులాపురం దగ్గరలో గల వివేకానంద సేవాశ్రమంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి విజయ జ్యోతి ఆదేశాల మేరకు కాశినాయన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుల్లూరు పెద్ద ఖాజావలి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వృద్ధులకు స్వీట్లు బ్రెడ్లు పండ్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే 2029 ఎలక్షన్ లలో ప్రధానమంత్రిగా రాహుల్ గాంధీ అయితాడని ధీమా వ్యక్తం చేశారు అంతేకాకుండా కాశి మండలంలో ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తేవాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయబ్ రసూల్ తది తరులు పాల్గొన్నారు

# ఆదోని నియోజకవర్గం ఓటర్లు సార్ కార్యక్రమానికి సహకరించాలి: వైఎస్ఆర్సిపి

**ఓటర్ జాబితా సవరణకు పార్టీ శ్రేణులు కృషి చేయాలి: డి సుర్వరాజు**



**ఆదోని,జూన్19.అక్షర టైమ్స్:–** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదోని నియోజకవర్గం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే వై సాయి ప్రసాద్ రెడ్డి పిలుపుమేరకు ఓటర్లు సార్ కార్యక్రమంలో పాల్గొని ఆదోని నియోజకవర్గం లోని ఓటర్లు తమ ఐడి కార్డును గ్రామ, వార్డు సచివాలయంలో పరిశీలించుకుని ప్రత్యేక ఇంటెన్సి రివిజన్ సార్ కార్యక్రమానికి సహకరించాలని వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ డి.సూర్పురాజ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ డి. సూర్పురాజు మాట్లాడుతూ, ఆదోని నియోజకవర్గం లోని వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు సార్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. ఓటర్లుకు అవగాహన కల్పించి, వారి ఓటర్ ఐడి కార్డులను వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా చూసుకోవడం తో పాటు, ప్రతి ఓటరు తమఓటు హక్కును కొనసాగించుకునేలా సహకరించాలని సూచించారు. గ్రామీణ పట్టణ ప్రాంతాలలో ప్రజలకు అందుబాటులో ఉండి అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఓటర్లు వివరాలు పరిశీలన, సవరణ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఓటర్లు హక్కులను పరీక్షించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, సార్ కార్యక్రమంలో ప్రజలు సక్రమంగా పాల్గొని తమ వివరాలను దృకరించుకోవాలని వారు పేర్కొన్నారు.

# ఘనంగా జరిగిన రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలో బాగంగా మానసిక వికలాంగుల కు అల్పాహారం పంపిణీ

**కడప నగరం,జూన్19.అక్షర టైమ్స్:–** ప్రియతమ యువనేత, జన్మదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ కడప నగర అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత రిమ్స్ లో గల అల్ షిఫా మానసిక వికలాంగుల కేంద్రంలో ఉన్న వారికి ఉదయం టిఫిన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సయ్యద్ గౌస్ పీర్ మాట్లాడుతూ, యువతకు ఆశాకిరణంగా నిలిచిన రాహుల్ గాంధీ దేశ ప్రగతికి యువశక్తే ప్రధాన బలమని ఎల్లప్పుడూ నమ్ముతారని తెలిపారు.యువత తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకుని, ప్రలోభాలకు లోనుకాకుండా దేశాభివృద్ధికి కట్టుబడి ఉన్న నాయకత్వాన్ని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు.ఇటీవలి నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనలతో దేశవ్యాప్తంగా విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని, ఈ అంశంపై విద్యార్థులకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో రాహుల్ గాంధీ నిరంతరం పోరాటం చేశారని పేర్కొన్నారు. అలాగే కడపలో యువత పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, విధానాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ మరెన్నో జన్మదినాలు జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తాను అహర్నిశలు కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కడప నగర ఉపాధ్యక్షులు అంజన్ కుమార్, సౌదాగర్ సాదిక్, ఫజారుల్లా, డివిజన్ ఇన్‌చార్జులు కరీముల్లా, సిద్ధిక్, మహబూబాషా, షేక్ సాదిక్, గఫార్, హమీదా ఖానం, సర్దార్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

**టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి**



**వేంపల్లె,జూన్19.అక్షర టైమ్స్:–** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక పక్కీరుపల్లిలోని బూత్ నెం. 248 వద్ద నిర్వహించిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామముని రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ) తమ పరిధిలోని ప్రతి ఓటరుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి చేజారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అధికారులు, బూత్ కమిటీ సభ్యులు సమన్వయంతో మ్యాపింగ్ ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి బూత్ ఇంచార్జ్ ఇస్మాయిల్, నాయకులు డక్కా రమేష్, జబీబుల్లా, లాడెన్, భాస్కర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

# బద్వేల్ సుభాష్ గాయత్రి కళాశాలలో యోగ





**బద్వేల్,జూన్19 అక్షర టైమ్స్:** జూన్ నెల 21 వ తేదీ దు జరుగు అంతర్జాతీయ యోగా దినోత్సవంను పురస్కరించుకొని ముందస్తు వేడుకలలో భాగంగా శుక్రవారం స్థానిక శ్రీ సుభాష్ గాయత్రి జూనియర్ కళాశాల నందు యోగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ యోగ గురువు ఎన్నో సంవత్సరాల నుంచి ఎన్నో పాఠశాలలు యోగ నేర్పిస్తున్నటువంటి యోగ గురువు ఎన్.దయాకర్ వారి శిష్యులు రాజమల్లు మనుహారిక,నాగ దాసరి స్వేచ్ఛ పాల్గొని కార్యక్రమాన్ని జరిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పుడు ఉన్నటువంటి మానసిక శారీరక సమస్యలు దృశ్య యోగ అత్యవసరమని ప్రతి ఒక్కరు యోగ సాధన చెయ్యాలని మానసిక శారీరకంగా దృఢంగా ఉండాలని దానికి ఎంతగానో యోగ తోడ్పడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థినిలు ఉత్సాహంగా పాల్గొని యోగా గురించి తెలుసుకుంటూ ఆసనాలు,ప్రణయమాలు చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ బైశాని శివశంకర్ రెడ్డి కళాశాల అధ్యాపకులు సురేష్ బాబు, శివయ్య, వెంకటసుబ్బయ్య, శివకుమార్, శివరాం, ప్రియాంక, పావని తదితరులు పాల్గొన్నారు.

# దూర విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉంది



**కోఆర్డినేటర్ డా" గంగాధర్**

**వేంపల్లె,జూన్19.అక్షర టైమ్స్:–** దూర విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డా. గంగాధర్ తెలిపారు. స్థానిక పట్టణంలోని డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ డా. గంగాధర్ మాట్లాడుతూ దూర విద్య ఇతర విద్యా విధానాలకు ఏమాత్రం తక్కువ కాదన్నారు. పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారు, రెగ్యులర్ డిగ్రీ చదివే అవకాశం లేక మధ్యలో చదువు నిలిచిపోయిన వారు దూర విద్యను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్య ద్వారా భవిష్యత్తును మెరుగుపరుచుకోవచ్చని, ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, రాజారెడ్డి, ప్రసాద్, తేజేంద్ర, రేష్మా తదితర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధి - రైతు సంక్షేమమే మోదీ ప్రభుత్వ లక్ష్యం

**బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నారిశెట్టి సుప్రజ**



**పోరుమామిళ్ల,జూన్19.అక్షర టైమ్స్:–** ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన అటల్ బిహారీ వాజపేయి ప్రారంభించిన ఈ పథకం గ్రామీణ భారత అభివృద్ధికి బలమైన పునాది వేసింది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 8 లక్షల కి.మీ.లకు పైగా గ్రామీణ రహదారుల నిర్మాణం.గత 12 సంవత్సరాలలోనే 4 లక్షల కి.మీ.లకు పైగా రోడ్ల నిర్మాణం,రైతులకు పొలం బాటకు రహదారులు, గ్రామాలకు మెరుగైన అనుసంధానం చేయడం జరిగింది అని అన్నారు . ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద 81 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ చేసిన ప్రభుత్వం అదేవిధంగా రైతులకు అండగా కేంద్ర ప్రభుత్వం ఉందన్నారు . పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి, ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన, ఇ - ఎన్ఏఎం ద్వారా డిజిటల్ వ్యవసమాట్లాడి ఎరువులపై భారీ సబ్సిడీ ,పాల ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో నంబర్-1 గా నిలిచిందన్నారు . రైతుల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, పేదల సంక్షేమమే అభివృద్ధి చెందిన భారతానికి బాటలు వేస్తున్నాయి అని మీడియా తో మాట్లాడినారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఒక నియోజకవర్గం, ఒక నెల, నాలుగు పర్యటనలు కార్యక్రమంలో భాగంగా అట్లూరు మండలంలో మూడవ పర్యటన



**అట్లూరు,జూన్19.అక్షర టైమ్స్:–** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువగా, పారదర్శకంగా మరియు సమర్థవంతమైన పరిపాలనను అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఒక నియోజకవర్గం, ఒక నెల, నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా మూడవ పర్యటనను ఈరోజు బద్వేల్ నియోజకవర్గంలోని అట్లూరు మండలంలో నిర్వహించారు. బద్వేల్ డివిజన్ ఆర్డిఓ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో, అట్లూరు మండలంలోని కొండూరు గ్రామపంచాయతీలో గల శ్రీ షిరిడి సాయి కళ్యాణ మండపం నందు నందు ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ శ్రీ మంచూరు సూర్యనారాయణ రెడ్డి , వివిధ శాఖలకు చెందిన జిల్లా, డివిజన్ మరియు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 92 అర్జీదారులు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలను సమర్పించారు. అందిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆర్డీవో ఆదేశించారు.

# తెలుగు గంగ టెక్నికల్ అసిస్టెంట్ ములపాకు ఈశ్వర్ రెడ్డి (54) మృతికి రెడ్యం సోదరులు సంతాపం




**ఖాజీపేట,జూన్19.అక్షర టైమ్స్:–** ఖాజీపేట మండలం కూనవారిపల్లెకు చెందిన అనంతపురం తెలుగుగంగ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న ములపాకు ఈశ్వర్ రెడ్డి అనంతపురంలోని వారి నివాస గృహంలో హార్ట్ ఎటాక్ తో మృతి చెందారు. ఈశ్వర్ రెడ్డి మృతదేహాన్ని కూనవారిపల్లెలోని వారి స్వగృహానికి తెచ్చారు.వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి,వైఎస్ఆర్సిపి నేత,కేసి కెనాల్ ప్రాజెక్టు మాజీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్ రెడ్డిలు శుక్రవారం కూనవారిపల్లెలోని వారి స్వగృహంలో ఈశ్వర్ రెడ్డి మృతదేహం పై పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించి తీవ్ర సంతాపాన్ని వ్యక్తపరిచారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి, ధైర్యం చెప్పారు.చిన్న వయసులో ప్రభుత్వ ఉద్యోగి మరణించడం అత్యంత బాధాకరమని రెడ్యం సోదరులు ఆవేదన చెందారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా కార్యదర్శి ముత్తూరు వెంకటసుబ్బయ్య, వైయస్సార్ సిపి యువజన విభాగం మండల అధ్యక్షుడు ముత్తూరు రమణ, వైయస్సార్ సిపి నేతలు కూన నాగిరెడ్డి, కూన చిన్ననాగిరెడ్డి, పాపిరెడ్డి రామలింగారెడ్డి పలువురు వైసిపి నేతలు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటీలో యూజీ-2026 అడ్మిషన్లు ప్రారంభం

**మొదటి రోజు 425 మంది విద్యార్థులకు సీట్లు**

**డైరెక్టర్ విజయ్ ప్రకాష్**









**వేంపల్లె,జూన్19.అక్షర టైమ్స్:–** ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ ఆర్కే వ్యాలీ ఆర్జీయూకేటీ క్యాంపస్ లో యూజీ-2026 అడ్మిషన్ల కౌన్సెలింగ్ శుక్రవారం ప్రారంభమైంది. క్యాంపస్ సెంట్రల్ లైబ్రరీలో నిర్వహించిన కార్యక్రమాన్ని డైరెక్టర్ ప్రొఫెసర్ జి. విజయ్ ప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కష్టపడి చదివి భవిష్యత్తులో కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం క్యాంపస్‌లో సీట్లు పొందిన తొలి ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు 500 మంది విద్యార్థులను పిలవగా 425 మంది హాజరై అడ్మిషన్లు పొందారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి డా. పి. రవి కుమార్, ఇడుపులపాయ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీప్రియ, డీన్ అకాడమిక్స్ డి. రమేష్ కైలాష్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డా. జి. వెంకటేష్, అసోసియేట్ డీన్లు రాఘవ రెడ్డి, నవీన్, ఉదయశ్రీ, హుస్సేన్, తిలక్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బి. లింగమూర్తి, ఐటీ ఇన్‌ఫ్రా కోఆర్డినేటర్ సంతోష్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డా. తిరుపతి రెడ్డి, వెల్ఫేర్ అధికారులు, అధ్యాపకులు బిన్నీ, ఓబయ్య, కోనప్ప తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్, వంటనూనెలను పొదుపుగా వాడి దేశ సంపదను కాపాడాలి

**తక్కువ గ్యాస్, తక్కువ నూనె వినియోగంపై వంటల పోటీ నిర్వహణ**

**బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ**





**వేంపల్లె,జూన్19.అక్షర టైమ్స్:–** దేశ ఆర్థిక పరిరక్షణలో మహిళలను భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పట్టణంలో వంట గ్యాస్, వంటనూనెల పొదుపు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ మాట్లాడుతూ.. వంట గ్యాస్, వంటనూనెలను మన దేశం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుందని, ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో వాటిని పొదుపుగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు వేంపల్లె మహిళలతో తక్కువ గ్యాస్, తక్కువ నూనె వినియోగంతో వంటలు తయారు చేసే పోటీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో మహిళలు వివిధ రకాల వంటకాలను ప్రదర్శించగా, తక్కువ గ్యాస్, తక్కువ నూనె వినియోగించిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం బీజేపీ మహిళా నేతలు కవిత, సౌభాగ్య, సుమతి మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యకరమైన వంట పద్ధతులను పాటిస్తూ కుటుంబ ఆరోగ్యంతో పాటు దేశ ఆర్థిక ప్రగతిలో భాగస్వాములు కావాలని సూచించారు. మహిళలు వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, సమాజ సేవకులుగా ఎదిగి దేశ అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు, బీజేపీ నాయకులు సుమన్, సునీల్, ఈశ్వర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ జన్మదినోత్సవం సందర్భంగా తిరుపతి నుంచి తిరుమలకు కాంగ్రెస్ నేతల పాదయాత్ర



**బ్రహ్మంగారిమఠం,జూన్19.అక్షర టైమ్స్:–** రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం తిరుపతి నుంచి తిరుమల వరకు కాలినడకన పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రలో ఏఐసీసీ సభ్యులు సుంకర గుండ్లకుంట్ల శ్రీరాములు, కడప డీసీసీ జిల్లా కార్యదర్శి, బ్రహ్మంగారిమఠం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సోమ అమర్నాథ్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. శ్రీవారి మెట్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నాయకులు పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్న రాహుల్ గాంధీకి భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని శ్రీ వేంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మనసు ప్రశాంతతకు శరీర దృఢత్వానికి యోగా ఎంతో అవసరం

**యోగా ఆరోగ్యకరమైన జీవన విధానానికి మార్గం: ప్రిన్సిపాల్ డా" ఉషశ్రీ**





**వేంపల్లె,జూన్19.అక్షర టైమ్స్:–** మనసు ప్రశాంతతకు, శరీర దృఢత్వానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఉషశ్రీ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. ఉషశ్రీ మాట్లాడుతూ యోగా అనేది కేవలం ఒకరోజు చేసే వ్యాయామం కాదని, అది ఆరోగ్యకరమైన జీవన విధానమని తెలిపారు. యోగా ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడంతో పాటు శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల పీడీ తేజేంద్ర విద్యార్థులకు వివిధ యోగాసనాలను అభ్యాసం చేయించి, వాటి ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 పీఓ డా. మల్లీశ్వరమ్మ, డా. ఎల్. నాగలక్ష్మిదేవి, కిరణ్మయి, డా. మాధవరావు, డా. సుధాకర్, డా. గంగాధర్, డా. సతీష్, టీవీ అరవింద్, రాజారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ ప్రధాని కావడం దేశ, రాష్ట్ర ప్రయోజనాలకు అవసరం

**ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు**

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డా" ఎన్.తులసి రెడ్డి**



**వేంపల్లె,జూన్19.అక్షర టైమ్స్:–** రాహుల్ గాంధీ ప్రధాని కావడం దేశ, రాష్ట్ర ప్రయోజనాలకు అవసరమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాల్సిన చారిత్రక అవసరం ప్రస్తుతం ఎంతైనా ఉందన్నారు. రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలను శుక్రవారం స్థానిక పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ విలక్షణమైన నాయకుడని, ప్రధానమంత్రి పదవిని త్యాగం చేసిన త్యాగశీలి అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్, దుగరాజపట్నం ఓడరేవు వంటి అంశాలు నెరవేరాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వం వహిస్తున్నారని అన్నారు. దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి సమస్యలు పెరుగుతున్నాయని విమర్శించారు. దేశ, రాష్ట్ర శ్రేయస్సు కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావాలని, ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త లక్ష్య సాధనకు కృషి చేయాలని తులసిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తులసి రెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీగాల రామకృష్ణ, నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.